www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 18 ఏప్రిల్ 2025
5
చిత్తూరు



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, అయినా పాల్పడితే భారీ జరిమానా, జైలు శిక్ష తప్పదని ప్రజలకు అవగాహన కల్పించాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని గురువారం కరపత్రాలను మహిళా ఆరోగ్య కార్యకర్తలకు అందించారు. ఆయన మాట్లాడుతూ పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ 1994ను పటిష్టంగా అమలు చేయాలని అవసరమైతే తప్ప స్కానింగ్ సెంటర్లు సైతం గర్భవతులకు స్కాన్ చేయరాదని ఒకవేళ చేసిన ఆడ, మగ శిశువు అన్న విషయాన్ని తెలపరాదని అన్నారు. అలా తెలిపితే ఆ స్కానింగ్ సెంటర్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకొని నిర్వాహకులను జైలుకు పంపుతారని తెలిపారు. సూపర్వైజర్లు ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

కరువు రాయితీపై అన్నదాతల ఆశలు

- నివేదికలతో సరి నష్టపరిహారం ఏది..?
- కరువు మండలాల్లో రైతుల ఎదురుచూపులు
- 16 మండలాల్లో ఎండిన 9068.88 ఎకరాలు
- అంచనా వ్యయం రూ.1,542 లక్షలు


రైతులతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృందం (ఫైల్ ఫోటో)

ఖరీఫ్ పంట నష్టపరిహారం కోసం జిల్లాలోని కరువు మండలాల రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల సంతోషం అడియాసలయ్యాయి. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో పడకపోవడంతో కనీసం ఖర్చుపెట్టిన దిగుబడి కూడా రైతుల చేతికి అందని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్

రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ సంవత్సరంలో ఖరీఫ్ పంట వేసి నష్టపోయిన రైతుల జాబితాను వ్యవసాయ శాఖ అధికారుల సేకరించారు. జిల్లాలో 16 మండలాల్లో 24,342 మంది రైతులను గుర్తించారు. 9068.88 ఎకరాల్లో పంట నష్టం వాటిలిందని వ్యవసాయ అధికారులు గుర్తించారు. జిల్లా వ్యవసాయ అధికారులు రూ.1542 లక్షల నష్టపరిహారం అంచనా తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి నిధులను మంజూరు చేయలేదు. దీంతో రైతులు చేసిన అప్పులు తీర్చలేక, ప్రభుత్వ సాయం అందక దిక్కుతోచన స్థితిలోనే ఉండిపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు పంట నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వేరుశనగకు పెట్టి పెట్టుబడి కూడా రాలేదు..
- చిట్టిబాబు, యాదమరి మండలం



గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట వేసాము. వేరుశెనగ పంట విత్తేందుకు, పొలం దున్నడానికి, విత్తనాలు విత్తడానికి, పొలంలో కలుపు తీయడం, వేరుశనగను ఒబిడి చేయటం ఇవన్నీ కలుపుకుంటే ఎకరాకు రూ.25వేలు వరకు ఖర్చు అయ్యింది. అయితే గత సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో వేరుశనగ పంట పొలంలోనే నీరు లేక ఎండిపోయి చేతికందలేదు. ఎకరాకు రూ.15 మూటలు రావలసిన వేరుశనగ అంతంత మాత్రంగా కేవలం మూడు మూటలు మాత్రమే వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు మిగిలి తీవ్రంగా నష్టపోయాం.

ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి
- తంగమణి, కోనాపల్లి గ్రామం




వేరుశనగ పంటలో ప్రత్యామ్నాయ పంటగా వేసిన కందులు పంట అయినా చేతికొస్తుందని ఆశించాం. వర్షాల లేకపోవడం వల్ల పొలాల్లో కంది గింజలన్నీ పుచ్చులుగా ఉండిపోయాయి. ఇటు వేరుశనగ కిందకు పంట కూడా చేతికి రాకుండా నష్టపోయాం. పంట సాగుకు రూ.20 వేలు అప్పు ఖర్చు పెట్టాం. వెయ్యిరూపాయలు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నష్ట పరిహారం మిర్చి ఆదుకోవాలి.

కరువు అంచనా నివేదికలు పంపించాం..
- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ



– కరువు అంచనా నివేదికలను ప్రభుత్వం దృష్టికి పంపించాం. నష్టపరిహారం వచ్చిన వెంటనే రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.


మండలంలో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్ ఫోటో)

ప్రభుత్వ భూములను పరిరక్షించండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ జేసి జి.విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్‌తో కలసి ఆర్‌డిఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్లు, తదితరులతో వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి తహశీల్దార్లు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తెలిపారు. మ్యుటేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పట్టా లేని భూమికి అనుభవ పత్రం కలిగిన వారికి ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.30ని తీసుకువచ్చిందని, ఈ ఉత్తర్వుల ద్వారా పట్టాలేని భూములను డిసెంబర్ 2025 లోపు క్రమబద్ధీకరణకు ప్రజలకు అవకాశం కల్పించిందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్ఓఆర్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి ఆర్‌డిఓలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్‌డిఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వారికి కేటాయించిన మండలాలలో భూ అలినేషన్, అసైన్మెంట్ భూమి, రెగ్యులరైజేషన్, ఆర్ఓఆర్, 22 ఏ, వెబ్ లాండింగ్, రీసర్వే సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. తహశీల్దార్లు వారి పరిధిలోగల గ్రామాల వారీగా సంబంధిత విఆర్ఓలతో వెబ్ ల్యాండ్ కరక్షన్లు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై సమీక్షలు నిర్వహించడం ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. వెబ్ ల్యాండింగ్ కరక్షన్లు చేసే సమయంలో తహశీల్దార్లు రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే పురోగతికి సంబంధించి విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్‌లతో సమీక్షలు నిర్వహించాలన్నారు. చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, ఆర్డిఓలు శ్రీనివాసులు, భవానీ, భవానీ శంకరీ, శ్రీనివాసులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అందించబోవు అత్యున్నత పురస్కారాలు– 2026వ సంవత్సరానికి పద్మ విభీషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కొరకు అంతర్జాతీయ క్రీడల్లో అత్యున్నత ప్రతిభాపాఠవాలు ప్రదర్శించిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఎ.బాలాజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఉన్న వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పనిచేస్తున్న క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ స్పోర్ట్సాప్@ జిమెయిల్‌కు మేనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పంపిన మయెడల అర్హత గల క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ కోసం పంపిస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ పాఠవాలు చూపుతున్న జిల్లా క్రీడాకారులు తగిన గుర్తింపు కొరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు అర్హత గలవారు పద్మవిభూషణ్ పద్మభూషణ్ పద్మశ్రీ అవార్డుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భోజనంలో నాణ్యత పాటించాలి: ఎంఈవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కరిడివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంను ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం భోజనం పెట్టాలని భోజనంలో నాణ్యత పాటించాలని, పిల్లలు తృప్తిగా భోజనం చేయాలని సూచించారు. అనంతరం భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో నాగేశ్వరరావు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు :సిఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి తాగునీటి సరఫరాకు సంబంధించిన వేసవి కార్యాచరణ ప్రణాళిక, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేసవి నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉన్న 332 మండలాల్లోని 3వేల 438 ఆవాసాలను గుర్తించి 67.31కోట్లతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేడి వాతావరణ పరిస్థితులు, వేడి గాలులు వీచే అవకాశం ఉందని కావున వేడి గాలుల పరిస్థితులను అధికమించేందుకు తగిన సంసిద్ధత ముందు జాగ్రత్త కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ సూచించారు. కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రైవేట్ తాగునీటి వనరులను అద్దెప్రాతిపదిక తీసుకుని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆదేశించారు. తాత్కాలిక నీటిసరఫరా వ్యవస్థల పునరుద్ధరణ, మరమ్మతులు, తాగునీటి చెరువులను నీటితో నింపడం, చేతి పంపులకు మరమ్మతులు నిర్వహించడం ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో వాటిపై స్పందించి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా తాగునీటికి సంబంధించి పబ్లిక్ గ్రీవియెన్స్ రిడ్రస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్), వివిధ ప్రసార మాధ్యమాలు, కరువు మానిటరింగ్ సెల్, కాంటాక్ట్ సెంటర్ టోల్–ఫ్రీ నంబర్ –1902 ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. అన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని జలవనరుల శాఖతో సమన్వయం చేసుకుని కాలువలకు అడ్డుకట్ట వేసి చెరుకువులకు నీటిని మళ్ళించి వాటిని పూర్తిగా నీటితో నింపాలని అన్నారు. భూగర్భ జలఆధారిత ప్రాంతాల్లో బోర్ బావులను ఫ్లష్ చేయడం, లోతు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. చేతి పంపులు, పవర్ బోర్‌లకు తక్షణ మరమ్మతులు నిర్వహించి అవి సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బంది గల ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి పట్టణ స్థానిక సంస్థలోను తాగునీటికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పాల్గొన్న జెసి, ఎస్పీ

వైసిపి కృష్ణవేణిపై కేసు నమోదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్సార్‌సీపీకి చెందిన కృష్ణవేణిపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాలలో ఇతరులను లక్ష్యంగా చేసుకొని అప్రతిష్ట కలిగించేలా వ్యాఖ్యానిస్తే, సంబంధిత వ్యక్తులపై తీవ్రమైన చర్యలు తప్పవని, వేధింపులు, అప్రతిష్ట కలిగించే పోస్టులు నేరమని, సోషల్ మీడియాలోనైనా చట్టం చురుగ్గానే ఉంటుందని నియమాలు పాటించకపోతే, ఆఫ్‌లైన్‌లో శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధమైన వ్యాఖ్యలు, సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చిత్తూరు జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బుధవారం 16వ తేదీ నారా లోకేష్ పై వైసిపికి చెందిన కృష్ణవేణి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నారా లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారని దీనిపై చిత్తూరు పట్టణానికి చెందిన శ్రీనివాస బాబు తమ అభిమాన నాయకుడు నారా లోకేష్ పై ఒక పార్టీకి చెందిన మహిళ, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇలా అసభ్యకర మోర్ఫింగ్ ఫోటోలు తమ నాయకుడిని అప్రదిష్టపాలు చేస్తూ పోస్టింగ్‌పై ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు 1వ పట్టణ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ కేసు నమోదు చేశారు.


మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలి

21న జరిగే ధర్నాను జయప్రదం చేయండి


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని 21న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని గురువారం ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. చిత్తూరు సిఐటియూ ఆఫీసులో అధ్యక్షురాలు కెపి.లలిత అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రధాన కార్యదర్శి షకీల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మారుస్తామని హామీ ఇచ్చి పది నెలలు అవుతున్నా ఇప్పటివరకు చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై 21న విజయవాడలో జరిగే ధర్నాకు జిల్లాలోని మినీ అంగన్వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో హామీ ఇచ్చినట్లు వేతనాలు పెంచాలని యాపులు రద్దుచేసి ఒకే యాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పని భారం తగ్గించి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చిన వాటికి జీవోలు విడుదల చేయాలన్నారు. జిల్లాలో 12 ప్రాజెక్టులలో స్థానికంగా వివిధ రకాల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం కోసం దశలవారి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అక్కడక్కడ రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని, అధికారులకు బెదిరింపులు కొనసాగుతున్నాయని వాటిని మానుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికంగా సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రాజెక్టు అధికారి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లా నాయకులు ప్రమీల, మమత, విజయ, శోభ, ధనకోటి, లీలావతి, సరళ, కస్తూరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షకీల, వాడ గంగరాజు

టిటిడి ఈవోను కలసిన గంగమ్మ గుడి ఛైర్మన్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ శ్రీధర్, కమిటీ సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావును గురువారం కలిశారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఈవోను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను సన్మానించారు. వచ్చేనెల పలమనేరులో జరగనున్న గంగమ్మ జాతరకు టీటీడీ తరపున సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా వారు ఆయన్ను కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు గంగమ్మ గుడి మాజీ ఛైర్మన్ అమ్ములు, టిడిపి నాయకులు ఆర్‌బిసి కుట్టి, జగన్, జనసేన నాయకులు అరుణ్ కుమార్ తదితరులున్నారు.



16వ ఆర్థిక సంఘం సమావేశంలో మేయర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగర మేయర్ ఎస్.అముద గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ వనగడియా, సభ్యులు తిరుపతిలో రాష్ట్రస్థాయి మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, పురపాలక సంఘాల ఛైర్మనలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ ఎస్.అముద హాజరయ్యారు. అర్బన్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి ప్రతిపాదనలను మేయర్ ఫైనాన్స్ కమిషన్‌కు అందించారు. మెజారిటీ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించాలని విన్నవించారు.


సమావేశంలో పాల్గొన్న మేయర్ అముద

నోట్, పాఠ్య పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు శ్రీసర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద ప్రభుత్వం అందించిన నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలను ఎంఈఓ శివరత్నమ్మ గురువారం అందజేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తోందని వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని అంతేకాకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని కూడా ప్రవేశపెట్టి కళాశాల విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని కూడా అందజేస్తున్నదని ఇటీవల జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాబోతున్న విద్యార్థులు తమ జూనియర్ కళాశాలలో చేరి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కోటీశ్వరయ్య అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 41వ బ్యాచ్ స్పోర్ట్స్ కోచింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోచ్ బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా నుండి ఆసక్తి గల వారు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎస్ఏఐ, ఎన్ఎస్ఎన్ఐఎస్, పాటియాలా వారి వెబ్సైటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్పైన్ ఉపాధి రుణాలు పొందడానికి ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మేనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 2025 సంవత్సరం గాను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసి రుణాలకు అర్హత గల అభ్యర్థులు మూడు కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లబ్దిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండి కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు చెంది ఉండాలని, 21 నుంచి 50 ఏళ్ల వారు, దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) కేటగిరీ కింద ఉన్నవారు, స్వయం ఉపాధి పథకాల రవాణా రంగానికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రవాణాకు సంబంధించి అయితే డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మన మిత్ర కార్యక్రమంపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ పురుషోత్తం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎండిపిఓ పురుషోత్తం ఆధ్వర్యంలో గురువారం మన మిత్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనమిత్ర (వాట్సప్ గవర్నెన్స్) కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మిత్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలు 9552300009 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపడం ద్వారా 224కి పైగా పౌర సేవలను ఇంటి నుండే పొందవచ్చు అని అవగాహన కల్పించాలన్నారు. జూన్ నెలకు 500కు పైగా సేవలు అందించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నారని, తదుపరి దశలో 1000కి పైగా సేవలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.

సభ్యుల డబ్బు రూ.11లక్షలు స్వాహా

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో వెలుగు గ్రూపుల సభ్యుల నగదు రూ.11 లక్షలు స్వాహా అయిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఏపిఎం, సిసి, సిఆర్పిలు ఏడు నెలలకు ముందే లెక్క తేల్చారు. అయితే వారిపై చర్యలు తీసుకోకుండా మూడు నెలల వ్యవధిలో కట్టించేలా నిర్ణయించారు. సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కడపనత్తం పంచాయతీ పరిధిలోని ఓ గ్రూప్ సభ్యులకు చెందిన నగదు ను ప్రతినెలా ఓ ఆశా వర్కర్ బ్యాంకులో జమ చేస్తానంటూ స్వాహా చేసింది. బ్యాంకు వారు అప్పు జమ కాలేదని అధికారులకు తెలపడంతో విషయం బయటకు వచ్చింది. దీంతో సంబంధిత ఆశా వర్కర్ మూడునెల్లల్లో కాజేసిన నగుదు కట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే గడువు ఇచ్చి నాలుగు నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు డబ్బు చెల్లించలేదు. అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదంటూ గ్రూపు సభ్యులు ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తమ డబ్బులు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరుతున్నారు.

విద్యతోనే సంపూర్ణ జ్ఞానం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఉన్నతమైన ఆలోచనలతో విద్యను అభ్యసించాలని తద్వారా విద్యార్థికి సంపూర్ణ జ్ఞానం సమాజంలో విలువ పెరుగుతుందని ఎస్టియు మండల అధ్యక్షులు బాబురెడ్డి అన్నారు. గురువారం ముత్తుకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి గోపాల్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎంతో క్రమశిక్షణతో విద్యని అభ్యసించాలని భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎస్టియు ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, డివిజనల్ కన్వీనర్ నారాయణస్వామి, సిఆర్‌సి ప్రధాన ఉపధ్యాయులు చంద్రయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ శకుంతల, వసంత పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్ నాగరత్నమ్మ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరత్నమ్మ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా జాగ్రత్తపడవచ్చు అని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే ఆహారంలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు గీత, గుణవతి, ఆశ వర్కర్ షీలా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమస్యలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని పలు సమస్యలపై తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌కు గురువారం ప్రజలు వినతిపత్రం అందజేశారు. వచ్చిన ప్రతి అర్జీదారని పలకరించి అర్జీలోని సమస్యలను తెలుసుకుని పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్టు తహశీల్దార్ తెలిపారు.

గ్రామీణుల ఇంటి వద్దకే వైద్యం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నచెల్లారగుంట గ్రామంలో గురువారం డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 11 మంది గర్భిణులకు చికిత్సలు నిర్వహించి మాత్రలు, మందులు అందజేశారు. అలాగే జనరల్ వ్యాధులు ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎన్‌సిడిసిడి సర్వే గురించి ప్రజలకి అవగాహన కల్పించడం జరిగిందని, ఈ సర్వే చేసేటప్పుడు ఇంట్లో ప్రతి ఒక్కరు ఉండి సహకరించాలని కోరారు. ప్రతి గర్భవతి కచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకుంటే తల్లీబిడ్డ సురక్షితంగాఉంటారని డాక్టర్ అరుణకుమార్ తెలియజేశారు.

ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం



ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేర్చుకోదగ్గ విద్యార్థుల కోసం ప్రధాన ఉపాధ్యాయులు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఇంటింటికి తిరిగి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. తన పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత భోజనం, తదితర సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలలో కూడా పాఠశాల ఉపాధ్యాయ బృందం వెళ్లి ఆరు సంవత్సరాలు పైబడిన విద్యార్థుల వివరాలను తీసుకొని వారిని కూడా తమ పాఠశాలలో చేర్పించే విధంగా అంగన్వాడీలు ప్రోత్సహించాలని కోరారు.

స్వర్ణ పంచాయతీపై ఎంపీడీవో సమీక్ష



ప్రజాశక్తి - సోమల: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇందులో భాగంగా ఇంటి పన్ను ఏ విధంగా వసూలు చేయాలి ఇతర పన్నులను ఏ విధంగా సర్దుబాటు చేయాలి తదితర అంశాలను ఎంపీడీవో నారాయణ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో స్పెషల్ డ్రైవ్ కింద చేపట్టిన పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి గ్రామాలను పంచాయతీలను అపరిశుభ్రంగా లేకుండా పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎక్కడైనా రక్షిత మంచినీటి బోర్లలో నీరు తగ్గితే ప్రజల అవసరాలకు అనుగుణంగా నీరు సరిపోకపోతే వెంటనే ట్యాంకర్ల ద్వారా అందించాలని వీధి దీపాలు ఏర్పాటు చేసి పల్లెల్లో వెలుగులు నింపాలని అంతేకాకుండా ఏప్రిల్ నెల ఆఖరిలోపు స్వర్ణ పంచాయతీని పూర్తిచేయాలని, వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి లక్ష్మి దేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ధర్నాకు పిలుపునిచ్చినట్టు కుప్పం డిపో అధ్యక్షులు యస్. మునస్వామి, కార్యదర్శి ఈ.జయపాల్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద యూనిటీ సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగులు ప్లే కార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో భాగమైన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమాన్ని మరవరాదన్నారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించిన 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, డబుల్ డ్యూటీకి చెల్లిస్తున్న పరిహారాన్ని పెంచాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు చెల్లించడంతోపాటు వేతనాలు పెంచాలని, ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్స్, రిమూవల్స్ ఆపాలని, పారదర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు చేయాలని, 4 సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులను అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, సిబ్బందికి పూర్తి వేతనంతో అనారోగ్య సెలవులు ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని పునరుద్దరించాలని కోరారు. డిపో సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, రమణ, డిపో వైస్‌ప్రెసిడెంట్ టివి.కుమార్, సహాయ కార్యదర్శులు ఎవి.నారాయణ, శ్రీనివాసులు, కోశాధికారి నవీన్, ఎం.బాలకృష్ణ, భాస్కర్, ప్రసన్న, దిలీప్, జి.రహంతుల్లా, వి.జయశంకర్ పాల్గొన్నారు.

పేడదిబ్బలను తొలగించాలి: ఈఓపీఆర్డీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: జాతీయ రహదారులు, గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో వేసిన పేడదిబ్బలు తొలగించాలని ఈఓపిఆర్డీ శారదాదేవి అన్నారు. గురువారం మండలంలోని కోగిలేరు, రాయలపేట, పెద్దకాప్పల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మురుగునీటి కాలువలు తరచూ శుభ్రం చేసి, ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేయరాదని, జాతీయ రహదారుల పక్కన పేడ దిబ్బలు వేయడం వల్ల పాదచారులకు వాహనదారులకు దుర్గంధం వెదజల్లుతుందని పేడ దిబ్బలను వెంటనే తొలగించాలనా సూచించారు. ఈ నెల 25వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మండల వ్యాప్తంగా నిర్వహించాలని గ్రామ కార్యదర్శులకు సర్పంచ్లకు తెలిపారు. ఇప్పటికే పేడ దిబ్బలు ఉన్నట్లు గుర్తించి లబ్ధిదారులకు నిర్ణీత గడువు ఇచ్చినా వారిలో



స్పందన రాకపోవడంతో జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో రాయలపేట, కోగిలేరు, పెద్దకాప్పల్లిలో రహదారి పక్కన వున్న పేడదిబ్బలను తొలగించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్, సుజాత పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి తలుపు విరాళం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రెడ్‌క్రాస్ సొసైటీ, జెసిఐలచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తలుపు విరాళంగా అందజేశారు. గురువారం గంగాధర నెల్లూరు మండల పరిధిలో వెజ్జుపల్లి గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనానికి పాతబడిన తలుపు తీయించి నూతన ఇనుము తలుపును జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్, చిత్తూరు గోల్డ్ అధ్యక్షులు ఎంవి.శ్రీధర్ రెడ్డి ఆర్థిక సహాయంతో రెడ్ క్రాస్ మండల ఛైర్మన్ పాపిరెడ్డి చొరవతో ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే సబ్ సెంటర్‌లో తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ గంగాధర నెల్లూరు మండల ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా ప్రజాప్రయోజన కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి ఆర్ సహదేవ నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, కుమార్ బాబు, ఏ ఎన్ ఎం ఈశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



తలుపు విరాళంగా ఇస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

బడికి 'బీగాలు'

విద్యార్థులతో తల్లిదండ్రుల ధర్నా
మా బడి మాకు కావాలని డిమాండ్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

'దగ్గరలోనే ఉండి విద్యాబోధన అందించే స్కూలును వదిలి, ఎక్కడో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాల పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం ఏంటి' అని తల్లిదండ్రులు ధ్వజమెత్తారు. మండలంలోని కాటూరు ఎంపియుపి స్కూల్లో వారం రోజులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతకాలు పెట్టాలని తమను విసిగిస్తున్నారని వాపోయారు. గురువారం స్కూలు ప్రధాన గేటుకు బీగాలు వేసి విద్యార్థులతో సహా ధర్నా నిర్వహించారు. కాటూరు స్కూల్లో చదువుకుంటున్న 6, 7, 8 తరగతుల పిల్లలను పల్లమాల జిల్లా పరిషత్ హైస్కూల్లో కలపాలని చూస్తే చాలా ఇబ్బంది అవుతుందన్నారు. ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు బస్సుల్లో వెళ్లి రావాలన్నా, రోడ్డు దాటాలన్నా తమ పిల్లలు క్షేమంగా ఇంటికి వస్తారో రారో అన్న భయం తమలో ఉంటుందన్నారు. కాటూరు స్కూల్లోనే తమ పిల్లల చదువులను కొనసాగించాలన్నారు. తమ



పాఠశాలను యుపి పాఠశాలగా ఉంచాలని, లేదంటే హైస్కూలుగా చేయాలని, అంతేగాని ప్రైమరీ పాఠశాలగా చేస్తే మాత్రం తాము సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మేకల. మురళి , గ్రామ ఉపసర్పంచ్ హేమచంద్ర రెడ్డి , కష్ణమూర్తి , ధనంజయులు , బతెయ్య , మురళి , మోహిద్దీన్ బాషా తల్లిదండ్రులు రమేష్, వెంకటేశ్వర్లు, ప్రశాంతి, సుజాత, మునెమ్మ, ఉమామహేశ్వరి, హారతి, శ్రీలేఖ, సుధాకర్, భాస్కర్, కుమార్, మాధవి, అనూష పాల్గొన్నారు.

విలీన పాఠశాలల్లో పిల్లల్ని చేర్చుకోవాలి : ఎంఇఒ

గురువారం విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యం సమీక్ష నిర్వహించారు. విలీనం అయ్యే పాఠశాలల్లో 21-23 తేదీల్లో విద్యార్థులను చేర్చుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్ల పైబడిన పిల్లల్ని హ్యాబిటేషన్ ప్రకారం సిఆర్‌పిల సహకారంతో పాఠశాలల్లో జాయిన్ చేసుకోవాలన్నారు. డ్రాపౌట్స్ ఎక్కడెక్కడ ఉన్నారో సిఆర్‌పిలు డబ్ల్యుఎన్ సహకారంతో పాఠశాలల్లో జాయిన్ చేసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మోటివేట్ చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని సర్పంచ్ కుమారి అన్నారు. గురువారం మండలంలోని ముంగరమడుగు ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవసభ ప్రధానోపాధ్యాయులు అనితా దేవి ఆధ్వర్యంలో జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల్లోనే భవిత మార్చుకోవాలని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్య ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు మునిరత్నం, ఎస్ఎంసి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

క్రమశిక్షణతో మెలగాలి

ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ప్రసాద్ అన్నారు.గురువారం మండలంలోని కొదల మడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఉన్నత పాఠశాలకు వెళుతున్నారని, వారు క్రమశిక్షణ విద్యపైధ్యాస ఉంచాలని అప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు అవుతుందన్నారు. ఉపాధ్యాయులు అమిద్ హుస్సేన్, వేణుగోపాల్ రెడ్డి, అమీన్ హుస్సేన్, హేమలత, రమ, బాలాజీ, స్వరాజ్, కుమారి, లలిత, వెంకటయ్య పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కార్వేటినగరం పంచాయతీకి చెందిన ముస్లిం ఏరియా అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ పద్మ సునంద ఆధ్వర్యంలో పోషణ పక్వాడపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లులను, గర్భవతులు, బాలింతలకు వెయ్యి రోజుల సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా చిరుధాన్యాల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. సూపర్వైజర్లు శామిని, ఇందిరా, అంగన్వాడిలు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- కుప్పంరూరల్: కుప్పం పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులు ప్రతినిత్యం రద్దీగా ఉండడంతో రాత్రిపూట పారిశుధ్య కార్మికులు తమ విధులను నిర్వహిస్తున్నారు. మురికి కాలువలలో శుభ్రపరచడం, రోడ్ల పక్కల చెత్తాచెదారం శుభ్రపరచడం వంటి పనులను పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలో అంటురోగాలు ప్రబలకుండా వారానికి రెండు రోజులు దోమల నివారణ మందులు పిచ్చికారి చేస్తామని కమిషనర్ తెలిపారు. గురువారం కొత్తపేట అర్బన్ కాలనీ ప్రాంతంలో దోమల పిచ్చికారి పనులను చేపట్టారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని కొలమాసనపల్లె క్లస్టర్ పరిధిలోని 17 ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గురువారం ఎంపీపీ(ఎస్) కొలమాసనపల్లె సౌత్ పాఠశాలలో ఆత్మీయ సమావేశం జరిగినది. ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖ అధికారిణి లీలారాణి, కొలమాసనపల్లె క్లస్టర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఈశ్వరప్రసాద్ హాజరైనారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు గ్రహీతలు అయినా ఎంపీపీ ఎస్.సాకే ఊరు పాఠశాలలో పనిచేస్తున్న ఆర్.జయలక్ష్మి, ఎంపీపీ ఎస్.కొలమాసనపల్లె సౌత్ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ త్రిలోక్ చందును శాలువతో సత్కరించి జ్ఞాపకలను అందజేయడం జరిగింది. సిఆర్సి జాయింట్ సెక్రటరీ ఎం.భాస్కర్, సిఆర్‌పి రెడ్డమ్మ, సిఆర్‌సి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్యోధన వధ



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని టీ.వడ్డూరు గ్రామపంచాయతీ ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన దుర్యోధన వధ ఘట్టాన్ని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని తిలకించారు. పగటి పూట జరిగే మహాభారత ఘట్టాలలో ఇది చివరిది. అత్యంత ప్రజాదరణ కలిగినది ధుర్యోధన వధ ఘట్టం ప్రజలను ఎంతగానో అలరించింది.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ఎంపీడీవో మోహన మురళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ బ్యాంకు రుణాల కొరకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మోహన మురళి అన్నారు. ఎంపిడిఓ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో స్వయం ఉపాధి పథకం కింద సబ్సిడీ బ్యాంకు లోను దరఖాస్తులు చేసుకోవాలనుకున్నవారు ఎస్సీ కులానికి చెందిన వారై 21 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వయసుగల వారు అర్హులని తెలియజేశారు. ఏపీ ఓబి ఎంఎంఎస్ సైట్ ద్వారా మే10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు.





తిరుపతిలో గురువారం కూటమి ప్రజాప్రతినిధులు, వైసిపి నేతల మధ్య టిటిడి గోశాల విషయమై మాటల యుద్ధం జరిగింది.. ఒకరికొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ దాదాపు ఐదారు గంటల పాటు ఉద్రిక్త వాతావరణాన్ని తలపించేలా నిరసనలు తెలుపుకోవడం గమనార్హం.

గోవుల 'గోల' మానండి

టిటిడి ప్రతిష్టను దిగజార్చొద్దు
ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

'గోవుల సంరక్షణ పేరిట ఒకరిపై ఒకరు పోటాపోటీగా చేసుకుంటున్న విమర్శలను, సవాళ్లు, ప్రతి సవాళ్లు ఆపి వాస్తవాలను భక్తులకు, ప్రజలకు తెలియజేయాలని టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో కోరారు. అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీల మధ్య సాగుతున్న వివాదం టిటిడిని అప్రతిష్ట పాలు చేసేట్టుగా ఉందని, టీటీడీని నమ్ముకుని లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారన్న విచక్షణ మర్చిపోయి, తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కున్న చందంగా టీటీడీని తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దారుణమని అన్నారు. తిరుపతి ప్రజలు జరుగుతున్న పరిణామాల పట్ల తీవ్ర వ్యతిరేక భావంతో ఉన్నారని పేర్కొన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై విచారణ జరిపించడం, లేదా తప్పుడు ఆరోపణలు అయితే చట్టబద్ధ చర్యలు తీసుకోవడం కాకుండా అధికార పార్టీ నాయకులే నానా యాగీ చేయటం, ఐదుగురు ఎమ్మెల్యేలు నేరుగా గోశాల వద్దకు రావడం, జన సమీకరణ చేయడం సమంజసంగా లేదని విమర్శించారు. టీటీడీలో భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యలు అనేకం ఉన్నాయని, అలాంటి వాటిపై చర్చ జరపకుండా మూగజీవాలను అడ్డం పెట్టుకుని తమ రాజకీయ ప్రయోజనాలపై విమర్శలు చేసుకుంటూ ప్రజలలో పలుచనపడ్డారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని నిజానిజాలు వెల్లడించి, వివాదానికి ముగింపు పలకాలని పేర్కొన్నారు.